క్లుప్తంగా

నేడు మంచినీళ్ల పండుగ

నడిగూడెం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నడిగూడెం మండల వ్యాప్తంగా మంచినీళ్ల పండుగ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుటుంబ సంక్షేమ పథకంలో చేరాలి

నడిగూడెం : కుటుంబ సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ కుటుంబ సంక్షేమ పథకంలో చేరాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.మోతీలాల్‌నాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ సంఘం సంక్షేమ నిధి కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ సభ్యత్వం కోసం రూ.200 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణలత, కనకమ్మ, మునీర్, మమత, అరుణజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ చేయాలి

నడిగూడెం : ప్రభుత్వం జీలుగ విత్తనాలు పంపిణీ చేయాలని నడిగూడెం మండల రైతులు కోరుతున్నారు. జిల్లాలోని పలు మండలాలకు జీలుగ విత్తనాలు మంజూరైనా, ఈ ఏడాది నడిగూడెం మండలానికి జీలుగ విత్తనాలు మంజూరు కాలేదు. తొలకరి చినుకులు కురవగానే జీలుగ విత్తనాలు విత్తుతామని ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే జీలుగ విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ములకలపల్లి ఠాగూర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పాలకవీడు మండలం జాన్‌పహాడ్‌లో మాజీ మంత్రి జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు.

బీసీ ఆర్థికసాయానికి దరఖాస్తు గడువు పెంచాలి

హుజూర్‌నగర్ : బీసీ కులవృత్తుల వారు ఆర్థిక సహాయం పొందడానికి దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని సామాజిక కార్యకర్త షేక్ మన్సూర్ అలీ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని కేవలం కొన్ని కుల వృత్తుల వారికి మాత్రమే ఇస్తుండటంతో మిగతా కులాల వారు నిరాశకు గురవుతున్నారన్నారు. కాగా దరఖాస్తుకు తక్కువ సమయం ఉండటంతో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలలో పడిగాపుల కాయాల్సి వస్తుందని తెలిపారు.

ఒంటిపూట బడులు నిర్వహించాలి

నేరేడుచర్ల : ఎండ తీవ్రంగా ఉన్నందున ఈనెల చివరి వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు మండిపోతుండటంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతారని తెలిపారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు ఆలోచన చేసి ఒంటిపూట బడులు నిర్వహించాలన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్



మునగాల : ఎన్ఎస్‌యూఐ మునగాల మండల అధ్యక్షుడిగా మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మండవ శంకర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలమాద పద్మావతి శంకర్‌గౌడ్‌కు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, రామరాజు, సామియేలు, వెంకటేశ్వర్లు గౌడ్, వెంకట్, శ్రీనివాస్‌గౌడ్, రషీద్, వీరబాబు, ఈదారావు పాల్గొన్నారు.

నోటు బుక్స్ పంపిణీ



మేడారంలో విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న దాత

నేరేడుచర్ల : మండలంలోని మేడారంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన నాగులపాటి చంద్రశేఖర్–లక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగులపాటి శ్రీనివాస్‌రావు శనివారం నోటు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లింగయ్య, రమాదేవి, సతీష్, స్థానికులు లక్ష్మీనారాయణ, ఉస్మాన్, మధు, శ్రీను, రాముడు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట



చిలుకూరు: దూదియాతండాలో గిరిజనోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



గరిడేపల్లి : రేగులగడ్డతండాలో సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : గిరిజనుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని దూదియాతండా గ్రామంలో నిర్వహించిన గిరిజనోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా అణచివేతకు, వెనుకబాటుకు గురైన గిరిజనులకు విలువ తీసుకొచ్చిన నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి వారి అభివృద్ధికి కృషిచేశాడన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. ఈ సందర్భంగా తండాల్లో ఘనంగా ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, సుంకరి అజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, సర్పంచ్‌లు నందలాల్, మంగమ్మ, ద్వాళీ, శంకర్, రవీందర్, ఎంపీటీసీ కృష్ణ చైతన్య, చైర్మన్లు జనార్దన్, సైదులు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే : ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని రేగులగడ్డతండాలో గిరిజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని గిరిజనులతో కలిసి బోగ్‌బండార్ నిర్వహించి సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజనులకు పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, సర్పంచ్ బానోతు ఉషా వెంకటేశ్వర్లునాయక్, ఎంపీటీసీ బానోతు రాములునాయక్, ఉపసర్పంచ్ జ్యోతి, గ్రామ కార్యదర్శి జానకి, వార్డుసభ్యులు బానోతు కోమటి, బానోతు వెంకటమ్మ, కౌసల్య, తులసియా, నరసయ్య, వెంకటాద్రి, దుర్గయ్య, గ్రామసిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన తండాల్లో బోగ్ బండార్

మఠంపల్లి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మఠంపల్లి మండలంలో నూతనంగా గ్రామపంచాయతీలుగా ఏర్పడిన తండాలలో శనివారం గిరిజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రంబోడుతండాలోని సేవాలాల్ ఆలయ ఆవరణలో గిరిజన పూజారులు బోగ్‌బండార్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుల్తాన్‌పూర్‌తండా, కొత్తండా, కాల్వపల్లితండా, కామంచికుంటతండా, జామ్లాతండా, లాలితండా, బాడవాతండా, కృష్ణాతండా తదితర తండాలలో గిరిజనులు బతుకమ్మలతో ఆడిపాడి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజనులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, మాజీ ఎంపీపీ కొండానాయక్, సర్పంచ్‌లు సునీతాలాలూనాయక్, బోడి రమేష్‌నాయక్, అనితాశ్రీనునాయక్, పార్వతీ, రామారావునాయక్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, గిరిజన ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధి

కోదాడరూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి జరుగుతోందని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని కూచిపూడితండాలో నిర్వహించిన గిరిజన దివాస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సైదా, బాదవత్ బాబురావు, సుఖ్య, తావురియా, సూర్యా, హనుమంతు, నెహ్రూ, బాపూజీ ఉన్నారు.



కోదాడరూరల్ : సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కవిత, తదితరులు



పాలకవీడు : మిగడంపహాడ్‌తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు



మఠంపల్లి : బాడవాతండాలో..

ఘనంగా గిరిజన దినోత్సవం

పాలకవీడు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో తెలంగాణ గిరిజన దినోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, బంజారా భవనాల ఏర్పాటు, విద్యా అవకాశాలను వివరిస్తూ ఆయా గిరిజన గ్రామపంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



చిలుకూరు : దూదియాతండాలో గిరిజనోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు



మఠంపల్లి : గుర్రంబోడుతండాలో బోగ్‌బండార్ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, గిరిజనులు



మఠంపల్లి : కామంచికుంటతండాలో..

మా నాన్నే మా హీరో

- ఎన్నో ఇబ్బందులు పడి మమ్మల్ని ఉన్నతస్థాయిలో నిలిపారు
- నేడు ఫాదర్స్ డే



తండ్రి సత్యనారాయణతో కుమార్తెలు సౌమ్య, శ్రావిక

కోదాడ : మేము జీవితంలో ఉన్నత సస్థాయికి చేరుకోవడానికి మా నాన్న పడ్డ కష్టం, తపన ఎప్పటికి మరువలేము. ఇప్పుడూ, ఎప్పుడూ మానాన్నే మా రియల్ హీరో అంటున్నారు కోదాడకు చెందిన తాటి సత్యనారాయణ కుమార్తెలు తాటి సౌమ్య, శ్రావిక. కోదాడలో చిన్న మెడికల్ షాపు నడుపుకొనే మానాన్న ఎన్ని ఇబ్బందులున్నా మా ఇద్దరిని ఉన్నత చదువులు చదివించాలని నిత్యం కష్టపడే వారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ఇద్దరం ఇండియాలో బీటెక్, అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగాలు చేస్తున్నాం. సామాన్య కుటుంబంలో పుట్టిన మేము ఈ స్థాయికి చేరుకోవడానికి నాన్న తపనే కారణం. మళ్లీ జన్మంటూ ఉంటే ఆయన కుమార్తెలుగానే పుట్టాలని దేవున్ని కోరుకుంటున్నామని అంటున్నారు.

అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : గోవిందపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తాను రాజకీయాల్లోకి వచ్చింది హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికని, ఎన్ని అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపురంలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, రూ.8 లక్షలతో శ్మశాన వాటిక, రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. గత మూడేళ్ల క్రితం గోవిందపురం ఎలా ఉంది ఇప్పుడెలా ఉందో ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. పని చేసే పార్టీలకే, పని చేసే అభ్యర్థులకే ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం గోవిందపురంలో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్త కందుల గోపయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న మన్యం విరంజి, ఆమడల లక్ష్మయ్యను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు సౌజన్య ధనుంజయ, వై.గురవయ్య, జె.శంబయ్య, పీఏసీఎస్ చైర్మన్ వై.శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తిని పెంపొందించుకోవాలి



నేరేడుచర్ల : దాంపత్య వ్రత హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శ్రీశ్రీశ్రీ రామదూత స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రత హోమం, కలశ పూజ మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ కొణతం సత్యనారాయణరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మార్కెండేయ, కౌన్సిలర్ సరిత, వల్లంశట్ల రమేష్‌బాబు, లచ్చిరెడ్డి, మాధవరెడ్డి, రాధ, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గాయపడిన వారికి ఎమ్మెల్యే పరామర్శ



కోదాడరూరల్ : బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన షేక్.అజీద్, హమీద్, సమీర్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ బాధితుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట కోదాటి కృష్ణయ్య, శ్రీధర్, కనకయ్య, వెంకటేశ్వర్లు, బడేమియా, గోరే, వెంకటనారాయణ, జలీల్, వెంకట్ ఉన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా



ఎస్టీ బాయ్స్ హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహం వార్డెన్ రవిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హాస్టల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ ఎస్టీ వసతి గృహం వార్డెన్ రవి నెల రోజులకొకసారి కూడా హాస్టల్‌కు రావడం లేదని ఆరోపించారు. స్థానికంగా విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా విధులు పట్ల అలసత్వం వహిస్తున్నాడని ఆరోపించారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, మెనూ పాటించాలని అడిగిన విద్యార్థులపై అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడన్నారు. వసతి గృహం గదులు, మరుగు దొడ్లను శుభ్రపరచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. వార్డెన్ రెగ్యులర్‌గా హాస్టల్‌కు రాకపోవడంతో వర్కర్లే వార్డెన్‌గా ప్రవర్తిస్తున్నారని, స్టోర్ రూం, మెనూ పూర్తిగా వర్కర్ల ఇష్టారాజ్యంగా నడుస్తుందన్నారు. వార్డెన్‌ను ప్రశ్నించిన విద్యార్థులను బలవంతంగా హాస్టల్ నుంచి పంపిస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌ను సందర్శించి విధులను సక్రమంగా నిర్వర్తించని వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, హాస్టల్లో మెనూ సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని కోరారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్‌కుమార్, నాయకులు గణేష్, జాను, చంద్రస్వామి, రవీందర్, సాయి, నవీన్, వెంకటేష్, సమీర్, రవి, శ్రీను, వంశీ, గణేష్, చరణ్, అజయ్‌రాజు పాల్గొన్నారు.

• ఎండలకు తాళలేక..



జూన్ మాసం సగానికి వచ్చినా భానుడి భగభగలు తగ్గడంలేదు. ఉదయం 8 గంటలకే ఎండలు మండిపోతున్నాయి. ఇక మధ్యాహ్నం సమయంలో 43 డిగ్రీలపైనే నమోదు అవుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. కాగా శనివారం మేళ్లచెరువు మండలంలోని రేవూరు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎండ వేడిమికి తట్టుకోలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇలా గోనె సంచులను తడిపి కిటికీలకు వేలాడదీసి ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. – మేళ్లచెరువు

సీపీఎం సీనియర్ నాయకుడు యలమందకు నివాళి

నేరేడుచర్ల : సీపీఎం సీనియర్ నాయకుడు వాస యలమంద శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. యలమంద మృతదేహాన్ని సీపీఎం నేరేడుచర్ల పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పాలకీడు పీఏసీఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్, నాయకులు తిరుపతయ్య, మీనయ్య, రామ్మూర్తి, కృష్ణవేణి, సైదులు, శ్రీను, యేసు తదితరులు ఉన్నారు.

ఘనంగా పద్మావతిరెడ్డి జన్మదిన వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి, కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, కౌన్సిలర్లు శ్రవణ్, టి.రాజ, వెల్దండ వీరారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, నాయకులు మంజీనాయక్, లక్ష్మి, సావిత్రి, వెంకటమ్మ, సైదులు, రాము, రవీందర్ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



డెక్కన్ సిమెంట్స్ పరిశ్రమ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

పాలకవీడు : పర్యావరణానికి హానీ కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దామని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు అన్నారు. ‘ప్లాస్టిక్ నిర్మూలన – పర్యావరణ పరిరక్షణ’ అనే నినాదంతో మండలంలోని పరిశ్రమ ప్రాంతంలో ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు, కాలనీవాసులతో కలిసి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీజీఎం యస్.నాగమల్లేశ్వరరావు పాల్గొని ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను వివరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నడిగూడెం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20వ తేదీన విద్యా దినోత్సవం సందర్భంగా బహుమతులను పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, సీఆర్‌పీలు గోవర్ధన్, గురుస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు దగ్ధమై నష్టపోయిన రైతును ఆదుకోవాలి

మోతె : మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు మామిడి తోట కాలిపోయిందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మామిడి తోట యజమాని పజ్జూరి వెంకన్న మండల తహసీల్దార్ పి.యాదగిరిని శనివారం కోరారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో 5 ఎకరాల మామిడి తోటలోని 80 మామిడి చెట్లు, 130 టేకు చెట్లు, 8 కొబ్బరి చెట్లు, 2 బత్తాయి చెట్లు కాలిపోయాయన్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు, ఆర్టికల్చర్ అధికారులు కాలిపోయిన తోటను పరిశీలించి సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేసి తనకు ప్రభుత్వం పరంగా నష్ట పరిహారం అందించాలని రైతు కోరారు.

గవర్నర్ తమిళిసైకి వినతి



వినతిపత్రం ఇస్తున్న స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సంయుక్తంగా శనివారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసైని కలిశారు. ఈ సందర్భంగా మహిళల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి, ప్రత్యేక సెలవుల మంజూరు విషయంలో పార్లమెంటులో చట్టం తేవాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ హైదరాబాద్ శాఖ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి, విన్నపం ఒక పోరాటం జీహెచ్ఎంసీ శాఖ అధ్యక్షురాలు కల్పనాదత్త, డాక్టర్ శ్రీదేవి, జ్యోతి, శ్రీపూజ, రాధిక, తదితరులు ఉన్నారు.

కిట్స్ కళాశాలలో టాస్క్ శిక్షణ తరగతులు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న టాస్క్ ప్రతినిధి

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ నైపుణ్య విజ్ఞాన సంస్థ (టాస్క్) ఆధ్వర్యంలో బీటెక్ సీఎస్‌సీ మూడో సంవత్సరం విద్యార్థినులకు జావా ప్రోగ్రాంపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ సలహాదారుడు పోతుగంటి నాగేశ్వరరావు, ఏఓ కృష్ణారావు, టాస్క్ సాంకేతిక నిపుణుడు కె రమేష్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో విశేష పూజలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునే శ్రీస్వామివారికి కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో బిందె తీర్థం తెచ్చి పంచామృతాలతో పంచసూక్త విధానంగా మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. శుక్రవారం రాత్రికే ఆలయానికి చురుకున్న రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు ఆలయ ఆవరణలో బస చేసి తెల్లవారుజామున కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి శ్రీస్వామివారిని, గోదాదేవిని, శ్రీఆంజనేయస్వామిని అదేవిధంగా క్షేత్రంలో గల శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలోని ముఖ మండపంలో నిత్యకల్యాణాన్ని ఎదుర్కోళ్ల మహోత్సవంతో ప్రారంభించి పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న దశరథరాంరెడ్డి

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరం గ్రామానికి చెందిన శామకూరి గోపయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పేదరికంలో ఉన్న మృతుని కుటుంబానికి కోదాడ పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వై.దశరథరాంరెడ్డి రూ.15వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. పెండెం వెంకట్రామ్‌గౌడ్, బొల్లంకొండ నాగయ్య, వెంకటేశ్వర్లు, కొండా వెంకటేశం, వీరయ్య ఉన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో శనివారం ఫాదర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.